www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 14 ఆగస్టు 2024
5
చిత్తూరు

కేరళ వయనాడ్ బాధితులకు 'ప్రజాశక్తి' విరాళాల సేకరణ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: కేరళ వయనాడ్ వరద బాధితులకు 'ప్రజాశక్తి' సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఎడిషన్ సిబ్బంది మంగళవారం విరాళాలు సేకరించారు. రేణిగుంట సిఆర్ఎస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్లో నిర్వహించారు. రేణిగుంట సిఆర్ఎస్ సిబ్బంది నుంచి మంచి స్పందన వచ్చిందని 'ప్రజాశక్తి' మేనేజర్ సిఎస్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విరాళాల సేకరణలో డెస్క్ ఇన్చార్జి ఎ.వనజ, సమన్వయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, గుణశేఖర్, నాగరాజు, సురేష్, డివిజన్ ఇన్చార్జులు దాము, వెంకట్రావ్, ప్రశాంత్, రామాంజులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల స్వాతంత్య్రం

హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచులు

ప్రజాశక్తి-పూతలపట్టు: దేశ ప్రగతికి పల్లెలే పట్టుకొమ్మలు.. అన్న గాంధీజీ మాటల్ని నిజం చేసే దిశగా కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. గడిచిన ఐదేళ్ల వైసిపి పాలనలో నిరాదరణకు గురైన గ్రామ పంచాయతీలకు కూటమి ప్రభుత్వంలో జవసత్వాలు వస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఆగస్టు వేడుకలకు ఇప్పటివరకు రూ.150 నుంచి రూ.250 మాత్రమే విడుదల చేసేవారు. దీంతో సిబ్బంది కనీసం బిస్కెట్లు కూడా కొనలేని పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ కార్యక్రమాల భారం

గత వైసీపీ హయాంలో నిర్వహించిన పలు ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఆరా కోరగానే డబ్బులు విడుదల చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు ఒక పంచాయతీకి రూ.40 వేల వరకు మాత్రమే ఇచ్చారు. దీంతో ప్రతి పంచాయతీపై ఆర్థిక భారం పడింది. స్వాతంత్య్ర, గణతంత్ర వేడుకలకు నామమాత్రంగా నిర్వహించే వారిని వారు అంటున్నారు.

నిధుల పెంపుపై హర్షం

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈనెల 15న స్వతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి చిన్న పంచాయతీలకు రూ.10వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25వేలు విడుదల చేస్తున్నట్లు ప్రకటించడంపై పలువురు సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన వైసీపీ పాలనలో ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బిల్లులు, ఇతర సర్దుబాట్ల పేరుతో దారి మళ్లించడంతో నిధులు కొరతతో సతమతమయ్యేవాళ్ళమని వాపోతున్నారు. ప్రస్తుత నిర్ణయంతో ఎంతో ఊరట కలుగుతుందని పలువురు సర్పంచులు అభిప్రాయపడుతున్నారు.

ఈ సారి [illegible]

ప్రస్తుత సర్కారు స్వాతంత్య్ర వేడుకలకు సంబంధించి అధిక మొత్తంలో నిధులు విడుదలకు ఆమోదం తెలపడంతో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సర్పంచులు సిద్ధమవుతున్నారు. గతంలో నిధుల కొరతతో నామమాత్రంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రస్తుతం పండగల చేపట్టేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇప్పటికే పలు పంచాయతీ కార్యాలయాలను స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు.

ఎంతో సంతోషంగా ఉంది

స్వాతంత్య్ర వేడుకలకు సంబంధించి కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ నిధులతో ఘనంగా నిర్వహిస్తాం. గతంలో అందుబాటులో ఉన్న నిధులతో నామమాత్రంగా నిర్వహించే వాళ్లం. ప్రస్తుతం ప్రత్యేక నిధులతో ఎంతో ఊరట కలిగించనుంది.

- దొరస్వామినాయుడు, సర్పంచి వడ్డేపల్లి

కనిపించే దేవుళ్లే శాస్త్రవేత్తలు

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ప్రారంభిస్తూ..

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

మనకు ప్రత్యక్షంగా కనిపించే దేవుళ్లే శాస్త్రవేత్తలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవానికి తనని ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉందనీ తెలిపారు. శాస్త్రవేత్తల మీద అపారమైన గౌరవం ఉందని, భారతదేశ చిత్రపటాన్ని అగ్రస్థానానికి తీసుకొచ్చిన ప్రతిఒక్క శాస్త్రవేత్తలకు జోహార్లు తెలిపారు. ఉపగ్రహాలను అంతరిక్ష కక్షలోకి ప్రవేశపెట్టాలంటే ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపి ఉంటారని శాస్త్రవేత్తలను కొనియాడారు. ఒకే ఉపగ్రహం ద్వారా 108 శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపించడం అంటే మాటలు కాదని, అది మన శాస్త్రవేత్తలకే సాధ్యమైందని తెలిపారు. స్కూలు విద్యార్థి నుంచి తనకు షార్ కేంద్రమైన శ్రీహరి కోటను చూడాలని కల ఉండేదనీ, నేటికీ కల నిజమైందనీ ఆనందం వ్యక్తం చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోగాలు చేయడం ఇస్రోకే సాధ్యపడుతుందని అన్నారు. ప్రయోగాలు విఫలమైన తరుణంలో వెన్నుంటి ప్రోత్సహించి శాస్త్రవేత్తలకు ధైర్యమిచ్చి మరలా ప్రయోగంలో సక్సెస్ సాధించిన ప్రయోగమే చంద్రయాన్ -2 ప్రయోగమని, భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీని కొనియాడారు. ముందుగా రేణిగుంట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో శ్రీహరికోటకు చేరుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లోని నక్షత్ర గెస్ట్‌హౌస్‌కి చేరుకున్నారు. అనంతరం జాతీయ అంతరిక్ష దినోత్సవం వేడుకలలో పాల్గొన్నారు. షార్‌లోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో జరిగే అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో పాల్గొని జోతి ప్రజ్వలన చేసి అంతరిక్ష దినోత్సవ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. అనంతరం షార్‌లోని అన్ని విభాగాలను, రాకెట్ అనుసంధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో షార్ డైరెక్టర్ రాజరాజన్, డిప్యూటీ డైరెక్టర్ రఘురాం, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్, షార్ కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, శాస్త్రవేత్తలు ఉద్యోగులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన రోడ్డు వేయాలి...

బెంగళూరు నుండి ఉపగ్రహాలను తీసుకువచ్చే క్రమంలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని శాస్త్రవేత్తలు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ని తెలిపారు. ఆయన వెంటనే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి బుచ్చినాయుడు కండ్రిక నుంచి మన్నారు, పోలూరు వరకు శ్రీ కాళహస్తి రోడ్డును 17 కిలోమీటర్ల మేర యుద్ధ ప్రాతిపదికన రోడ్లను వేయాలని దానికి సంబంధించిన నిధులను ప్రభుత్వంతో మాట్లాడి వెంటనే సమకూరుస్తానని ఆయన హామీ ఇచ్చారు.

కార్మికుల పొట్ట కొట్టేలా కొత్త టెండర్లు వద్దు

- ఎస్పీడీసీఎల్ స్టోర్ వద్ద హమాలీల నిరసన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విద్యుత్ హమాలీల పొట్టగొట్టేలా కొత్త టెండర్ల విధానాన్ని తీసుకురావొద్దంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. 15ఏళ్లుగా పనిచేస్తున్న హమాలీల స్థానంలో కొత్త వారిని తీసుకొస్తూ యాజమాన్యం కొత్త టెండర్ల విధానాన్ని తీసుకురావడానికి నిరసిస్తూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో గిరింపేటలో ధర్నా చేపట్టారు. చిత్తూరు డిస్టిక్ స్టోర్ కార్యాలయం ముందు ఈ కార్యక్రమం జరిగింది. ధర్నాలో ఏపీడిస్టిక్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎం.ఆరోగ్యదాస్ మాట్లాడుతూ గత 20సంవత్సరాలుగా ఎలక్ట్రిసిటీ డిస్టిక్ స్టోర్స్‌లో పనిచేస్తున్న అనంతపురం కార్మికులను వారి పొట్ట కొట్టే టెండర్లను పిలవడం దారుణమన్నారు. గత మూడు సంవత్సరాలుగా అగ్రిమెంట్లకు సంబంధించిన టెండర్లు షెడ్యూల్స్‌ను కొందరు కాంట్రాక్టర్లు టెండర్లు పిలిచినప్పుడు మాకు అడ్డుగా వచ్చి కాంట్రాక్ట్ తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారన్నారు. బయట కాంట్రాక్టర్లకు ఇవ్వడం న్యాయం కాదని, ఈ టెండర్లను ది డిస్టిక్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీకి ఇప్పించవలసిందిగా రాష్ట్ర అధికారులకు తెలిపామన్నారు. ఎన్ని చెప్పినప్పటికీ బయట వారికే టెండర్లు ఇవ్వడాన్ని నిరసిస్తూ అనంతపురం కార్మికులకు మద్దతుగా చిత్తూరు డిస్టిక్ స్టోర్స్ హమాలీలుగా తాము ధర్నా చేస్తున్నట్లు వివరించారు. అనంతపురం కార్మికులకు న్యాయం జరిగేంత వరకు తాము పనిలోకి రాము అని తేల్చిచెప్పారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచివరం సురేంద్రన్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న హమాలీలకు న్యాయం చేయకుండా బయట ఉన్న కాంట్రాక్టర్‌కి పనులు ఇవ్వడాన్ని ఆయన వ్యతిరేకించారు. సామాజిక న్యాయాన్ని కాపాడవలసిన విద్యుత్ శాఖ వారు వారి శాఖలో పనిచేస్తున్న హమాలీలకు అన్యాయం చేస్తూ బయట ఉన్న కాంట్రాక్టర్లకు మేలు చేయడానికా అంటూ తూర్పారబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని అనంతపురం కార్మికులకు వారి బ్రతుకులకు భద్రత కల్పించి అది డిస్టిక్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారికి ఈ కాంట్రాక్ట్‌ని ఇవ్వవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, శివ, ఆనంద, బి.గంగాధర, హరి వేలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- ఇబ్బందులుంటే పోలీసులకు ఫిర్యాదు చేయండి
- ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ మణికంఠ చందోలు హెచ్చరించారు. ఎలాంటి ర్యాగింగ్ చేసిన పోలీసులను ఆశ్రయించాలని విద్యార్థులకు సూచించారు. మంగళవారం అపోలో యూనివర్సిటీలో యాంటీర్యాగింగ్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది విద్యాసంస్థలలో ఒక తీవ్రమైన సమస్య అన్నారు. విద్యార్థులు అనుభవించే హింస, నైతిక దారుణం, మానసిక క్షోభలను కలిగించే ప్రవర్తనగా చెప్తారు. ఈ కార్యక్రమాలు విద్యార్థుల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి, వారి భవిష్యత్తు మీద కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. ర్యాగింగ్ వ్యతిరేక చట్టాలు మన దేశంలో ఈ ప్రవర్తనను నివారించడానికి ప్రవేశపెట్టబడ్డాయన్నారు. విద్యార్థుల మధ్య సహకారంతోనే ర్యాగింగ్‌ను పూర్తిగా నిషేధించవచ్చునన్నారు. సీనియర్ విద్యార్థులు తమ జూనియర్‌లను ప్రోత్సహించాలి, వారికి సహాయపడాలని సూచించారు. ర్యాగింగ్‌కి బదులుగా, స్నేహపూర్వక సమూహాలుగా మారి, తార్కికంగా ఆలోచిస్తూ పరిష్కార మార్గాలను కనుగొనవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అపోలో కాలేజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్ భట్, కాలేజీ డీన్ డాక్టర్ ఆల్ఫ్రెడ్ ఆగస్టిన్, అపోలో కాలేజీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నరేష్ రెడ్డి, రిజిస్ట్రార్ పోతరాజు, ఈస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రావు, తాలూకా ఎస్ఐ ఉమా మహేశ్వర రెడ్డి, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

విధులను బాధ్యతగా భావించాలి

- జెసీ శ్రీనివాసులు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: తన విధి నిర్వహణ చురుకుగా ఉంటూ ఉత్తమమైన ప్రతిభను జెసీ పి.శ్రీనివాసులు కనపరిచే వారని కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ బదిలీపై గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా వెళుతున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం తరపున ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ.. జేసీ తన విధి నిర్వహణలో చురుకుగా ఉంటూ ఉత్తమమైన ప్రతిభను కనపరిచారని, కలెక్టర్‌గా తాను బాధ్యత చేపట్టి 45రోజులు అయ్యిందని, ఈ సమయంలో విధి నిర్వహణలో తనకు ఎంతో సహకరించారన్నారు. ప్రతిష్టాత్మకమైన ఎన్నికల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించారన్నారు. సీఎం పర్యటనలు, ఇతర ప్రభుత్వ పథకాల అమలులో తనదైన ముద్ర వేశారన్నారు. జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లాలో విధులు నిర్వర్తించడం చాలా ఆనందంగా ఉందని, జిల్లాలో కార్యక్రమాలను విజయవంతం చేయడంలో అధికారులందరూ కలసి కట్టుగా పని చేసేవారన్నారు. అధికారుల సమన్వయంతో సాధారణ ఎన్నికలు, భూ సమస్యల పరిష్కారం, ఓటర్ జాబితా తయారీ, తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించ గలిగానన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సిబ్బందితో సంయమనంతో ఉంటే ఉత్తమమైన ఫలితాలు వస్తాయని గ్రహించానన్నారు. ఉన్నతాధికారులు ఇచ్చిన విధులను భారంగా కాకుండా బాధ్యతగా, అవకాశంగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ హిమ వంశి, డిఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అనారోగ్యంతో అంగన్వాడీ కార్యకర్త మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బంగారుపాళ్యం మండలంలోని నల్లగంపల్లి అంగన్వాడీ కార్యకర్తగా విధుల్లో ఉంటున్న విజయలక్ష్మి గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో సోమవారం రాత్రి మృతి చెందింది. మంగళవారం ఆమె భౌతికకాయానికి పలువురు అంగన్వాడీ సిబ్బంది, కార్యకర్తలు నివాళులర్పించారు.

డిజిటలైజేషన్ పూర్తి చేయాలి: కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గాంధీ జయంతిలోగా అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు సింగిల్విండోలులో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జీడీ నెల్లూరు సింగల్ విండో కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందుకు సంబంధించి ఈ కేవైసీ, ఆధార్, ఫోన్ నెంబర్, భూములు వివరాలు ఆయా మండలాల్లోని తహశీల్దార్‌లు, ఎంపీడీవోలు, సచివాలయం అధికారులు ద్వారా వివరాలు సేకరించుకుని, కంప్యూటర్‌లో నమోదు ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. మండల సొసైటీలో 7525మంది రైతులకు గాను 1725లకు చెందిన వివరాలను డిజటలైజేషన్ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డిసిసిబి సిఈవో మనోహర్ గౌడ్, డీజీఎం వెంకటా చలపతి, ఆప్కాబ్ సీనియర్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిసిసిబి బ్రాంచ్ బ్యాంక్ చీఫ్ మహేష్, తహశీల్దార్ చంద్రశేఖర్, డిప్యూటీ తహశీల్దార్ తులసి రామ్, మేనేజర్లు రమేష్, విజయ, సొసైటీ సీఈవో విజయ్ కుమార్ రెడ్డి, స్టాఫ్ అసిస్టెంట్ మునుస్వామి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి: డీఎంహెచ్‌వో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో ప్రభావతి ఆదేశించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీలకు క్వాలిటీ అస్యూరెన్స్ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. అర్హత కలిగిన ఆరోగ్య ఉపకేంద్రాలను గుర్తించడం, జాతీయ నాణ్యత ప్రమాణలను అమలుపరిచిరోగులకు మెరుగైన సేవలు అందించడం, మెడికల్ పరికరాలు, మందులు లభ్యతపై దృష్టి పెట్టడంపై డాక్టర్ నిరంజన్ రెడ్డి ట్రైనింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ హర్ష వర్ధన్, క్వాలిటీ మేనేజర్ డాక్టర్ దివ్య పాల్గొన్నారు.

జవాన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: అర్మీ జవాన్ భౌతికకాయానికి అధికారులు, జవాన్‌లు ఘన నివాళులర్పించారు. మండలంలోని గొల్ల చీమలపల్లి గ్రామానికి చెందిన జవాన్ కొండల నవీన్ కుమార్(34) జమ్మూ కాశ్మీర్‌లో 13ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. సోమవారం రాత్రి స్వగ్రామానికి నవీన్‌కుమార్ మృతదేహాన్ని ఆర్మీ అధికారులు తీసుకొచ్చారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మీ అధికారులు గౌరవ వందనం చేశారు. అర్మీ జవాన్ మృతి పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నవీన్‌కుమార్‌కి భార్య(గర్భవతి), 3ఏళ్ల కుమారుడు ఉన్నారు. స్థానిక తహశీల్దార్ మాధవరాజు, వీఆర్‌వోలు ఆర్మీ జవాన్‌కు ఘన నివాళులర్పించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్‌కు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ నాయకులు మంగళవారం కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు జివి రమణ, సోమశేఖర్ నాయుడు, మణి గండన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించాలని, జిల్లా పరిషత్ భవిష్యనిధి సంబంధించి గత ఐదు సంవత్సరాలుగా అసంబద్ధంగా నిర్వహిస్తున్నారు. వీటిని క్రమబద్ధీకరించి సంబంధిత చందాదారులకు నెల వారి జమలను ఆన్లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు నాణ్యమైన సన్నబియ్యం ప్రత్యేకంగా సరఫరా చేయాలన్నారు. జిల్లాలో ఉర్దూ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు సరఫరా చేయాలని కోరారు. ఇటీవల కాలంలో మృతి చెందిన ఉపాధ్యాయ కుటుంబాలలో అర్హత గల వారికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తించారు. ప్రభుత్వ పాఠశాలల స్థలాలు అన్యాక్రాంతానికి గురికావడానికి అవకాశం ఉండగా, పాఠశాలకు సంబంధించి స్థలాలను గుర్తించి, సర్వే చేయించి హద్దులను గుర్తించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. గతంలో ఉన్న మెడికల్ రీయంబర్స్మెంట్ సౌకర్యం పునరుద్ధరకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, రెహానా బేగం, రెడ్డప్ప నాయుడు, ఎస్పీ బాషా, పార్థసారథి, సుధాకర్, వంశీకృష్ణ, సురేష్ బాబు, సర్దార్, చిరంజీవి, పెద్దబ్బ రెడ్డి, సారథి, నాగరాజు, బాబు, వడివేలు, గిరి, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

వెదురు దొంగల కోసం వేట

- అనువనువూ గాలింపు
- ప్రజాశక్తి వార్తతో కదిలిన అటవీ అధికారులు
- 81 చిన్న ఉప్పరపల్లి అటవీ పరిసరాల్లో సోదాలు

ప్రజాశక్తి-సోమల: అటవీ ప్రాంతంలో వెదురు దొంగల కోసం అటవీ అధికారులు వేట మొదలపెట్టారు. అక్రమంగా అడవుల్లోంచి వెదురు తరలించేస్తున్నారన్న సమాచారంతో మంగళవారం ప్రజాశక్తిలో 'వెదురు మోపు - స్మగ్లింగ్ భలే ఊపు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అటవీ అధికారులు 81 చిన్న ఉప్పరపల్లి, బోనమంద అటవీ ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. అనువనువూ గాలిస్తున్నారు. వెదురు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నిఘా పటిష్టం చేసినట్లు పుంగనూరు రేంజ్ అటవీ అధికారి శ్రీరాములు తెలిపారు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజల సహకారంతో సంపదను కాపాడుతామన్నారు. అడవులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అటవీ ప్రాంతాల్లోంచి వెదురు, కలప వంటివి అక్రమంగా తరలిస్తే కఠినమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోదాల్లో ఎఫ్ఎస్‌వో బాలసుబ్రమణ్యం, ఆవులపల్లి సెక్షన్, ఎఫ్‌బివో షాజహాన్, రాంపల్లి బీట్ ఎఫ్‌బివో మహేష్, గొల్లపల్లి బీట్ అధికారి, ఎలిఫెంట్ ట్రాకర్స్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి: ఉమావాణి

సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ పీడీ ఉమావాణి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జీడీ నెల్లూరు మండలంలో ఉపాధి పథకం ద్వారా వివిధ పనులు రూ.9.77కోట్లుతో జరిగిందని డ్వామా అడిషనల్ పీడీ ఉమావాణి అన్నారు. 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అడిషన్ పీడీ మాట్లాడుతూ ఉపాధి పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పనులు పారదర్శకంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గత ఏడాధి 2023-24ఆర్థిక సంవత్సరంకు గాను ఉపాధి హామీ పథకం ద్వారా 1921పనులకు రూ.6.56కోట్లు పనులు జరిగాయని, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 70పనులకు గానూ రూ.3.15కోట్లు పనులు జరిగాయని, గృహ నిర్మాణ శాఖ ద్వారా 61 పనులకు గాను రూ.2.36లక్షలు, పశు వైద్య విభాగ శాఖ ఆధ్వర్యంలో 3పనులకు గాను రూ.2.52 లక్షలు ప్రభుత్వం ద్వారా పనులు జరిగాయని తెలిపారు. ఈ తనిఖీలో ఉపాధి హామీ పథకంలో రికవరీ కింద రూ. 4,900, పెనాల్టీ కింద రూ.వెయ్యి జమ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ హరిబాబు, జిల్లా విజిలెన్స్ అధికారిణి గంగాభవాని, పెన్షన్స్ ఏసి రవి, మండల ఏపీఓ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ దాము, వర్క్ ఇన్స్పెక్టర్ గీత పలువురు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయండి: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రెవెన్యూ శాఖతో వ్యవసాయశాఖ సమన్వయం చేసుకొని ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈ క్రాప్ బుకింగ్, 100రోజుల ప్రణాళిక అమలులో భాగంగా బిందు, తుంపర్ల సేద్యం పరికరాలకు పంపిణీకి సంబందించి రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖలకు సంబంధించిన జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ఆర్‌బీకేల్లో ఈ క్రాప్ బుకింగ్‌ను పూర్తి చేసేందుకు రెవిన్యూ శాఖతో సమన్వయం చేసుకొని పూర్తి చేయాలన్నారు. బిందు, తుంపర్ల సేద్య పరికరాల పంపిణీకి సంబంధించి 2024-25 సంవత్సరంలో లక్ష్యం 21,000 హెక్టార్లు కాగా వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 3,500 హెక్టార్లు లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, ఏపీఎంఐపి పిడి బాలసుబ్రమణ్యం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెస్ట్ సర్కిల్ ఆఫీస్ తనిఖీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు వెస్ట్ సర్కిల్ పోలీస్ కార్యాలయాన్ని ఎస్పీ మణికంఠ చందోలు మంగళవారం తనిఖీ చేశారు. సర్కిల్ ఆఫీస్ నిర్వహణ, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రంకన్ డ్రైవ్ రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, వెస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ నాయుడు, ఇన్స్పెక్టర్ రవి శంకర్ రెడ్డి, సర్కిల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వానా కాలం.. వ్యాధుల భయం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వర్షకాలం మొదలైంది.. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటితో చిత్తడిగా మారుతున్నాయి. వర్షపు నీరు పల్లపు ప్రాంతాల్లోకి చేరి దోమలను వృద్ధి చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. చాలా ఏళ్ల కిందట నిర్మించిన అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థ అనేక ప్రాంతాల్లో మురుగునీరు, వర్షపు నీరు పారేందుకు డ్రైనేజీలు లేకపోవడంతో వర్షకాలలో ప్రజల సమస్యలు వర్ణణాతీతంగా మారుతోంది. జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో 40ఏళ్ల డ్రైనేజీ వ్యవస్థ కొనసాగుతోంది. పట్టణ విస్తీర్ణం పెరిగి నగర పాలక సంస్థగా అవతరించి దాదాపు 13ఏండ్లు గడుస్తున్నా.. నగర పాలక సంస్థ డ్రైనేజి వ్యవస్థను పట్టించుకోకపోవడంతో నగరంలోని ప్రధాన వీధుల్లో చిన్న పాటి వర్షానికి నగరంలోని ప్రధాన వీధుల్లో వర్షపు, మురుగునీరు పారుతోంది. నగర ప్రధాన కూడలి ఎంఎస్ఆర్ సర్కుల్‌లో మోకాళి లోతు నీటిలో పిల్లలు, వృద్దులు ఇబ్బందులు పడుతూ నడవాల్సి వస్తోంది. తరచూ ఇక్కడి మురునీరు రోడ్డుపైకి వస్తోంది. నగరంలోని మురునీరు నీవా నదిలో కలిసే ప్రధాన మురికి కాలువలు అన్యాక్రాతం కావడంతో మురుగునీరు రోడ్లుపైకి వస్తోంది.

దోమల బెడద

వార్షలతో వాతావరణంలో వచ్చిన మార్పుల ఫలితంగా నివాస ప్రాంతాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడం, ఖాళీ ప్రదేశాల్లో వర్షపు నీటి నిల్వలతో దోమలు వృద్ధి పెరిగి నగర గ్రామీణ ప్రాంతవాసులు నరక యాతన అనుభవిస్తున్నారు. దోమల నివారణ కోసం పాగింగ్ చేయాల్సి ఉంటుంది. చిత్తూరు కార్పొరేషన్‌లో ఒకటి రెండు ఫాగింగ్ యాంత్రాలు మినహా మిగిలినవి మరమ్మతులకు గురై మూలన పడ్డాయి. ప్రతి 15 రోజులకో మారు దోమల నివారణ కోసం పాగింగ్ చేయాల్సి ఉంది. జిల్లాలోని గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీల్లో ఏమాత్రం నిబంధనలు పాటించడం లేదని విమర్శలున్నాయి. ఫలితంగా దోమల వృద్ధి చెంది ప్రజలు రోగాల భారినపడుతున్నారు. వారం రోజుల క్రితం పుంగనూరులో డెంగ్యూ వ్యాధి భారిన పడి గిరిజన బాలిక మృతి చెందిన విషయం తెలిసేందే. సీజన్ వ్యాధులపట్ల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది. ఇంటింటా ప్రచారం చేస్తున్నా.. దోమల నివారణపై తగిన జాగ్రత్తలు తీసుకోని ఫలితంగా దోమల భారినపడి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధుల భారినపడి అసుపత్రుల పాలౌతున్నారు. మురుగునీటి డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయడంతో పాటు దోమల నివారణ కోసం చర్యలు చేపట్టాని ప్రజలు కోరుతున్నారు.

వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం

సీజనల్ వ్యాధులపై జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందని అప్రమత్తం చేయడం జరిగింది. ఎప్పటికప్పుడు వారి పరిధిలోని ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించేలా ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తున్నాం. డెంగీ కేసులు నమోదు అవుతున్న ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించి పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నాం. సీజనల్ వ్యాధులపట్ల వైద్య ఆరోగ్యశాఖ సూచనల మేరకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ ఓ.ప్రభావతిదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

నేడు మండల మీట్

ప్రజాశక్తి-సదుం: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నటు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో జి.రాజశేఖర్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సదుం ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో సమావేశం కానున్నట్లు తెలిపారు. గత జూన్ నెలలో ఎంపీపీ ఎల్లప్ప గుండె నొప్పితో మరణించడంతో వైస్ ఎంపీపీ వి.ధనుంజయ రెడ్డితో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మోటారు ఏర్పాటు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఎస్.నడింపల్లి పంచాయతీ పసలమంద గ్రామంలో తాగునీటి సౌకర్యార్థం సింగల్ ఫేస్ బోరు మోటారు అమర్చినట్లు సర్పంచ్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు నిరంతర నీటి సరఫరా అయ్యేవిధంగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. 30 కుటుంబాల వారికి తాగునీటి సమస్య లేకుండా చేసినట్టు కార్యదర్శి సబిత తెలిపారు.

దోమల నివారణకు పైరత్రం పిచికారీ

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని దళితవాడలో పంచాయతీ, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పైరత్రం మందును మంగళవారం పిచికారీ చేపట్టారు. వర్షాలు కురుస్తుండడం కారణంగా అక్కడక్కడ నిలిచిన వర్షపు నీటిలో దోమలు ప్రబలి తద్వారా ప్రజలకు డెంగీ, మలేరియా వైరల్ ఫీవర్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. వీటి నివారణ కోసం ఇండ్లలో మందు పిచికారి చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్, సిహెచ్ఓ అమర్నాథ్ తెలిపారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలంలోని అరగొండ సచివాలయం వద్ద మునీశ్వర్‌రెడ్డి దంపతుల సహ కారంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు పరీక్షలు చేపట్టారు. క్యాన్సర్, గుండె, కిడ్నీ, డయాలసిస్, బిపి, షుగర్, ప్లాస్టిక్ సర్జరీ, యూరాలజీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఎన్‌టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచిత శాస్త్ర చికిత్స నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో తవణంపల్లి వాసులు చికిత్స చేయించుకున్నారు.

టీచర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమ్మపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శోభ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులను బోధించుటకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ లోపు పాఠశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రాయితీపై డ్రిప్‌ల పంపిణీ

ప్రజాశక్తి-గుడిపల్లి: రైతులకు రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. మంగళవారం ఆయన కుప్పిగానిపల్లి, అగరం, యామగానిపల్లి ఆర్‌బీకేలో డ్రిప్ రిజిస్ట్రేషన్స్‌ను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడారు. రాయితీపై ఇస్తున్న పరికరాల గురించి తెలిపారు. పరికరాలు పొందేందుకు అర్హత, ప్రమాణికాలను వివరించారు. రైతులు ఆధార్ కార్డు, 1బి, ఫోన్ నంబర్లతో ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గుడుపల్లి మండలంకు 900హెక్టార్లకు పరికరాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భోజనం రుచిగా ఉండాలి

ప్రజాశక్తి-విజయపురం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలని పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రాజు పేర్కొన్నారు. మంగళవారం విజయపురం మండలం శ్రీహరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తరగతి గదులను పరిశీలించి బోధన సమయంలో ఉపాధ్యాయులు బోధన సామాగ్రిని ఉపయోగించాలని, విద్యార్థుల వర్క్ బుక్స్ నోటు పుస్తకాలలో తప్పులు సరిదిద్దాలని తెలిపారు. ప్రతిరోజు దినచర్య, పాఠ్య ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి-విజయపురం: విజయపురం మండల తహశీల్దార్ కిరణ్‌ను మంగళవారం వైసీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువలతో సత్కరించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తించారు. నాయకులు రాజగోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీరాములు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని పన్నూరు జగన్నాథపురం చురుకాపురం సచివాలయంలో మంగళవారం ఎంపీడీవో రమణ ప్రకాష్ రికార్డులు తనిఖీ చేశారు. అలాగే ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. విధి నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటించాలని ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కోరిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలన్నారు. పని ప్రదేశంలో సౌర్యాలు ఏర్పాటు చేయాలన్నారు.

కార్మికుల ఆరోగ్యానికి భరోసా

- నగరపాలక కార్మికుల కళ్లకు చికిత్సలు

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ కార్మికుల సంపూర్ణ ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నగరపాలక పరిధిలోని ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం పరిధిలోని కార్మికుల కోసం గత వారం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. ఇందులో భాగంగా కంటి సమస్యలతో బాధపడుతున్న కార్మికుల కళ్ళకు ప్రత్యేక చికిత్సలు చేయిస్తున్నారు. చిత్తూరు నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం కార్మికులకు మంగళవారం చిత్తూరు ప్రభుత్వ బోధన ఆసుపత్రిలో ప్రత్యేక నేత్ర చికిత్సలు చేయించారు. కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆసుపత్రికి వెళ్లి వైద్య చికిత్సలు అందుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. ఈ నెల 2, 3వ తేదీల్లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా కార్మికులకు నిర్వహించిన నేత్ర పరీక్షల్లో 19 మందికి నేత్ర సంబందించిన సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. పలువురికి కంటి చూపునకు సంబంధించి కంటి శుక్లం శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కమిషనర్ కార్మికులతో మాట్లాడి భరోసా ఇచ్చారు. కంటి శస్త్ర చికిత్సలు చేయించుకోవాలని, ఇందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు

అందిస్తామని ధైర్యం చెప్పారు. అనంతరం సంబంధిత వైద్యులు, అధికారులతో కమిషనర్ మాట్లాడారు. కార్మికులకు అవసరమైన అన్ని వైద్య సేవలు దగ్గరుండి అందించాలని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

టీటీడీకి అన్నదాన సేవకు కూరగాయల వితరణ

ప్రజాశక్తి-శాంతిపురం: టీటీడీలో అన్నదాన సేవా కార్యక్రమానికి జెడ్పీటీసీ ఎస్.శ్రీనివాసులు అతని సహచర బృందం మంగళవారం సుమారు 9టన్నుల కూరగాయలు వితరణగా అందించారు. ఈ సందర్భంగా విలేకరులతో జడ్పీటిసి మాట్లాడుతూ శ్రీ వెంగమాంబ వెంకటేశ్వర స్వామి అన్నదాన సేవా కార్యక్రమానికి అందిస్తున్న ఈ కూరగాయల వితరణ ద్వారా ఆ శ్రీనివాసుడి కరుణా కటాక్షాలు రాష్ట్ర ప్రజలకు ఉండాలని

కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుధా రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాదమరి ఎంపీడీవోగా శివరాజ్ బాధ్యతలు

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: యాదమరి ఎంపీడీవోగా ఓ.శివరాజ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీవో సింగన్న బదిలీ అయ్యారు. కార్యాలయ ఏవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డి హరి ప్రసాద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఎంపీడీవోను దుశ్శాలువలతో సత్కరించారు.

కంటి చికిత్సకు 15మంది ఎంపిక

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం కోలార్‌లోని జలప్ప మెడికల్ కళాశాల బృందం వైద్య సేవలు అందించారు. 50మందికి పరీక్షలు నిర్వహించగా 15మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. వారికి పూర్తి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేపడతామని స్పష్టం

చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 12మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని ఐఆర్ఎమ్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాలు విజయవంతంగా ముగిసినట్టు కళాశాల అధ్యక్షులు బిఎం దయానిధి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో జరిగిన ప్రాంగణ నియామకాలలో ఆల్ సి పరిశ్రమ పాల్గొని, నియామకాలు చేపట్టినట్టు తెలిపారు. పాల్గొన్న 50మంది విద్యార్థులలో 12మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్టు వారు తెలిపారు. అనంతరం కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ వై.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తమ

కళాశాలలో నిర్వహించే వివిధ రకాల శిక్షణలు విద్యార్థులకు ప్రాంగణ నియామకాలలో ఎంపిక కావడానికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, ప్లేస్మెంట్ అధికారి సుమయ, అధ్యాపకుల బృందం పాల్గొన్నారు.

చిన్నారిని రక్షించిన ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ప్రమాదవశాత్తు సంపులో పడిన చిన్నారిని కాపాడి శభాష్ అనిపించుకున్నాడు ఓ ఉపాధ్యాయుడు. వివరాలు.. మండలంలోని దేవదొడ్డి పాఠశాల వద్ద విద్యార్థులంతా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కావల్సిన ఏర్పాట్లలో ఉన్నారు. సమీప కాలనీ నుంచి అకస్మాత్తుగా కేకలు వినిపించాయి. ఆందోళనకరంగా అక్కడికి వెళ్లిన ఉపాధ్యాయుడు శరవనన్‌కు ఏడాదిన్నర చిన్నారి సంపు తొట్టిలో పడిపోయిందని చెప్పారు. వెంటనే సంపులోకి దిగి చిన్నారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యంలు శరవనన్‌ను అభినందించారు.

కేవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-కార్వేటినగరం: సహకార సంఘంలో ఉన్న రైతులకు కేవైసీ తప్పనిసరిగా ఉండాలని సహకార సంఘం సీఈవో దుష్యంత్ తెలిపారు. మంగళవారం తమ కార్యాలయంలో రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో సీఈవో మాట్లాడుతూ సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని పేర్కొన్నారు. కేవైసీ నమోదు కోసం ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ అందించి ఈ నెల 30లోపు కేవైసీ చేసుకోవాలన్నారు. కేవైసీ చేసుకున్న రైతులకు మాత్రమే సహకార సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుందని ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం నమోదుకు ఆసక్తి కలిగిన రైతులు కూడా కేవైసీ చేసుకొని సహకార సంఘంలో సభ్యతం పొందాలని కోరారు.

18న కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయపురం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 18వ తేదీన తిరుపతి సురేంద్ర కంటి హాస్పిటల్ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విజయపురం వికలాంగుల సేవా సంస్థ మంగళవారం ప్రకటనలో తెలిపింది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియం చేసుకోవాలని కోరారు.

మాన్యువల్ స్కావెంజర్స్‌పై సర్వే

ప్రజాశక్తి-సోమల: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-సానిటరీ లెట్రిన్ వివరాలపై సర్వే నిర్వహిస్తున్నట్టు సోమల ఈవోఆర్‌డి లక్ష్మీదేవి తెలిపారు. మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-శానిటరీ లెట్రిన్స్ ఉంటే తదుపరి చర్యలు చేపట్టేందుకు స్థానిక పంచాయతీ, సచివాలయాలలో సమాచారం ఇవ్వాలని ఆమె తెలిపారు.

వైభవంగా ఆడిపొంగళ్లు

ప్రజాశక్తి-కార్వేటినగరం: పాదిరికుప్పంలో వెలసిన నడివీధి గంగమ్మ ఆలయంలో ఆడిపొంగళ్ల వేడుకను వైభవంగా జరుపుకున్నారు. అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాన్ని వేపాకు తోరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక వాయిద్యాల నడుమ ఉదయం అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి పొంగళ్లు వండి, పిండి దీపాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

19న నవంబర్ నెల శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల ఆన్లైన్ కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన నవంబరు నెల కోటాను ఆగష్టు 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవాటికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఆగష్టు 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు ఆగష్టు 21 నుండి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను, అదేవిధంగా నవంబరు 9న శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న పుష్పయాగం సేవ టికెట్లను ఆగష్టు 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

ఆగష్టు 22న వర్చువల్ సేవల కోటా విడుదల

వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన నవంబరు నెల కోటాను ఆగష్టు 22న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

23న అంగప్రదక్షిణం టోకెన్లు

నవంబరు నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకన్ల కోటాను ఆగష్టు 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన నవంబరు నెల ఆన్‌లైన్ కోటాను ఆగష్టు 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా నవంబరు నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను ఆగష్టు 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

నవంబరు నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఆగష్టు 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతిలలో నవంబరు నెల గదుల కోటాను ఆగష్టు 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

27న శ్రీవారి సేవ కోటా విడుదల

ఆగష్టు 27న తిరుమల - తిరుపతి శ్రీవారి సేవ కోటా ఉదయం 11 గంటలకు, నవనీత సేవ మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ మధ్యాహ్నం 1 గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగ

చిత్తూరులో

ప్రజాశక్తి-యంత్రాంగం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ఊరూ వాడా అంతటా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను చేపడుతున్నారు. మంగళవారం చిత్తూరు పట్టణంలో గాంధీ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున జాతీయ జెండాతో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరైయ్యారు. ఈ నెల 9 నుంచి 15వరకూ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. చిత్తూరులో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పాల్గొన్నారు.

రామకుప్పంలో

సోమలలో

బంగారుపాళ్యంలో

సదుంలో

కుప్పంలో

మారుమోగిన భారత మాతాకీ జై నినాదాం

ప్రజాశక్తి-కార్వేటినగరం: జై భారత్, భారత్ మాతాకీ జై నినాదంతో మంగళవారం కార్వేటినగరం వీధులు మారుమోగింది. ఏపీఎం విజయకుమార్, ఈవో పీఎస్ మణి ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి ఆలయం ఆర్చీ నుంచి పోలీస్ స్టేషన్ వరకు మహిళా సంఘం సభ్యులు త్రివర్ణ పతాకంతో పాటు స్వాతంత్ర్య సమర యోధుల ఫోటోలతో ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ దేశభక్తిని స్వాతంత్రోద్యమ

ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది

స్ఫూర్తిని నేటి తరాలకు తెలపాలనే ఉద్దేశమే ఈ ర్యాలీ అన్నారు. ఈవో పీఎస్ మణి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి పోరాటం చేసిన మహా యోధులను నిత్యం స్మరించుకోవాలన్నారు.

జవ్వనపల్లి సచివాలయానికి తాళం

ప్రజాశక్తి-వికోట: గత ప్రభుత్వంలో సచివాలయ నిర్మాణానికి స్థలం ఇస్తే వీకోట జగనన్న కాలనీలో తనకు ఇస్తానన్న ఇంటి స్థలం ఇవ్వకపోవడంతో ఆగ్రహంతో ఓ వ్యక్తి గ్రామ సచివాలయానికి తాళం వేసిన సంఘటన మండలంలో వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని జవనపల్లికి చెందిన అజయ్ సచివాలయ నిర్మాణానికి గత ప్రభుత్వంలో స్థలం ఇచ్చాడు. దీనికి బదులుగా వీకోట జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి ఇంటి స్థలం తనకు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోకపోవడంతో తీవ్ర ఆగ్రహావేశంతో మంగళవారం సచివాలయానికి తాళం వేశా

డు. గత పాలకులు ఇచ్చిన మాట మేరకు పేద ప్రజల నుంచి సేకరించిన స్థలానికి ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలం మంజూరు చేయకపోవడం శోచనీయమని ప్రజలు వాపోయారు. ఈ సంఘ టనపై వీకోట ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్‌కు తరలిన ఎంఆర్‌పీఎస్ నాయకులు

ప్రజాశక్తి-సోమల: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఢిల్లీ పర్యటన ముగించుకొని గ్రేటర్ హైదరాబాద్‌కు రానున్న సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు సోమల మండలం నుంచి అధిక సంఖ్యలో ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి, మందా రామనాథం, ప్రకాష్, మొగిలీశ్వరయ్య, శుభకర్, వెంకట్రామయ్య, మండలం నుంచి పలువురు దళిత యువకులు, అభిమానులు

తరలి వెళ్లారు. మంగళవారం మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలికి ఆయన పర్యటనను విజయవంతం చేసినట్టు వారు తెలిపారు.

గ్రామాభివృద్ధికి సర్పంచ్‌లే కీలకం

ప్రజాశక్తి-కార్వేటినగరం: గ్రామాల అభివృద్ధికి సర్పంచే కీలకమని రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ పరిశీలకు (ఆర్ఎస్ఎ) ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని చెత్తసంపద భవనంలో సర్పంచ్లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణా కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ పరిశీలకులు మాట్లాడుతూ పంచాయతీలోని ఎస్డబ్ల్యు కేంద్రాలను సంపద కేంద్రాలు తీర్చిదిద్ది వచ్చే ఆదాయంతో పంచాయతిని అభివృద్ధి చేసుకోవాలన్నారు. పారిశుధ్యలోపం,, తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని చెప్పారు. అదే విధంగా వర్షాకాలన్నీ దృష్టిలో ఉంచుకుని మురుగునీటి నిల్వలు లేకుండా పారిశుద్యాన్ని మెరుగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీలో వ్యర్థాలతో తయారు చేసిన ఎరువులను పరిశీలించి రైతులకు చౌక ధరకు అందించి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వెచ్చించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవో పీఎస్ మణి, సర్పంచ్ ధనంజయవర్మ, సర్పంచ్లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

తపాలా బీమాతో జీవితం ధీమా

- తపాలా శాఖ సిబ్బంది సిద్దయ్య

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: తపాలా బీమాతో జీవితం ధీమాగా ఉంటుందని తపాలా శాఖ సిబ్బంది సిద్దయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్‌పిఓ లక్ష్మన్న, ఏఎస్‌పిఓ విద్యావతి ఆదేశాల మేరకు తపాలా శాఖలో పథకాలను వివరించేందుకు రమణ బాబు కళాజాత ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖలో ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, జీవిత బీమా, చిన్న మొత్తాలతో పొదుపులు పలు పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని వివరించారు. ఈ పథకాలతో బడుగు బలహీన వర్గ ప్రజలు ఉపయోగపడుతుందని, ఈ సౌకర్యాలను ప్రతి

ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. కళాజాత బృందం పాటల ద్వారా పథకాలను వివరించారు. కార్యక్రమంలో తపాలా శాఖ సిబ్బంది గిరి, కళాజాత బృందం దుర్గాప్రసాద్, గోపి, తిరుపతి పాల్గొన్నారు.

గుడి డబ్బులు కూడా మింగేస్తారా..

- ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని ఆరిమాని గంగమ్మ ఆలయ అభివృద్ధిపై డాక్టర్ థామస్ మంగళవారం కార్యకర్తలతో ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ నిధులను స్వాహా చేసిన ఘనత ఇక్కడ వైసిపి నాయకులకే చెల్లిందని అన్నారు. గుడి నిర్మాణ పనులు ప్రారంభించి మూడు సంవత్సరాలు అవుతున్న నిర్మాణం నత్త నడకన సాగుతుందని నిధులు మాత్రం స్వాహా చేసినట్లు తెలుస్తుందని అన్నారు. మంగుంటకు చెందిన మాజీ విఆర్ఓ హిమాచలపతి రెడ్డి ఆలయం నిర్మాణం కోసం ఇంతవరకు రూ.48లక్షల ప్రభుత్వం ఇచ్చిందని పనులు మాత్రం జరగడంలేదని దీంతో పాటు గత ఐదు సంవత్సరాల్లో ఆలయానికి వచ్చిన నిధులను స్థానిక జెడ్పిటిసి పార్టీ అండతో స్వాహా చేశారని ఆరోపించారు. దీనిపై ఘాటుగా స్పందించిన ఎమ్మెల్యే ఆలయానికి సంబంధించి 18గ్రామాల ప్రజలు కూర్చుని

కూటమిలో ఉన్న పార్టీల నాయకులతో కలిసి బోర్డ్ ఏర్పాటు చేసుకుంటే తాను ఆలయానికి ప్రభుత్వం నుంచి రావలసింది నిధులను ఇప్పిస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ భూములను గుర్తించి ఇవ్వాలని తాను పరిశ్రమలు తెప్పిస్తానని స్థానిక తహసీల్దార్ అమర్నాథ్ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీమోహన్, నాయకులు జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, భాస్కర్ నాయుడు, ధనుంజయ నాయుడు, బాలాజీ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, సిద్దయ్య శెట్టి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని బైపాస్ రోడ్డు గుండా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని, ఈచర్ వాహనాన్ని కుప్పం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తమిళనాడుకు చెందిన రేషన్ బియ్యాన్ని మంగళవారం అక్రమంగా తరలిస్తున్న వాహనం పట్టణంలోని బైపాస్ రోడ్డులో పంచర్‌కు గురై రోడ్డు పక్కన ఆపివేశారు. అటుగా వచ్చిన పోలీసులు అనుమానంతో ఆరా తీయగా అందులో సుమారు 10టన్నుల తమిళ రేషన్ బియ్యం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వాహనాన్ని అదుపులోనికి తీసుకున్నారు.

హత్య కేసులో నిందితురాలు అరెస్ట్

ప్రజాశక్తి-పలమనేరు: హత్య కేసులో నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని లక్ష్మీనగర్ కాకతోపునకు చెందిన ఆనంద్, భారతి దంపతులు. ఆనంద్ కొంత కాలంగా లక్ష్మీనగర్‌లో ఉంటున్న మంగమ్మతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. 11న రాత్రి సుమారు 11గంటల సమయంలో తన భర్తను మంగమ్మ కత్తితో దాడి చేసి హతమార్చినట్లు ఆనంద్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



దర్యాప్తు అనంతరం మంగళవారం మంగమ్మను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు వివరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు

ప్రజాశక్తి-శాంతిపురం: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు శిక్ష పడినట్లు రాళ్ళబూదుగూరు ఎస్ఐ నరేష్ తెలిపారు. రెండు రోజులుగా తప్పతాగి వాహనం నడుపుతున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఐదు మందిపై కేసు నమోదు చేసి మంగళవారం కుప్పం జేఎస్సీఎం ఎఫ్ఎసి పిడిఎఫ్ కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు. వారికి రెండు రోజుల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానాను విధిస్తూ న్యాయమూర్తి

తీర్పునిచ్చారని ఎస్ఐ తెలిపారు. తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

లారీని ఢీకొన్న కారు

- ప్రమాదంలో యువకుడు మృతి

- మరో ఇద్దరు యువకులకు గాయాలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని అప్పిరెడ్డి కండిగ వద్ద ముందూ వెళుతున్న ఈచర్ వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ఇద్దరు యువకులు గాయాలతో ఆసుపత్రి పాలైయ్యారు. సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి మిట్టకు చెందిన హర్షవర్ధన్ రెడ్డి, ప్రమోద్, ఆకాశ్‌లు స్నేహితులు. వీరు ముగ్గురు కలిసి కొత్తపల్లి మిట్ట నుంచి సోమవారం రాత్రి సుమారు 12గంటల ప్రాంతంలో కారులో చిత్తూరు పట్టణానికి బయలుదేరారు. మార్గం మధ్యలో మండలంలోని అప్పిరెడ్డి కండిగ బస్టాప్ సమీపంలో వెనుకనుంచి ఈచర్ వాహనాన్ని ఢీకొట్టారు. ప్రమాదంలో ప్రమోద్, హర్షవర్ధన్ రెడ్డి, ఆకాష్ తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు గుర్తించి వారని చిత్తూరు ప్రభుత్వ

ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్‌లు సూచన మేరకు రాణిపేట సీఎంసీకి గాయపడిన ముగ్గురు యువకులను తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హర్షవర్ధన్ రెడ్డి మంగళవారం మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. కాగా మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు జీడీ నెల్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కొత్తపల్లి మిట్టలో హర్షవర్ధన్ రెడ్డి భౌతికాయానికి ఎమ్మెల్యే డాక్టర్ థామస్, మాజీ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయనంద రెడ్డి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.